


# నివాళి

ఎ. మంజులత.

రెండో ప్రపంచ యుద్ధానికి పూర్వపు మాట. వాటర్ టౌన్ అనే వూరిలో ఎండకు ఎండి, వానకు తడిసిన ఆ సైన్ బోర్డు మీద "జోసెఫ్ హెచ్. వాట్సన్ ఎం. డి." అని ఉండేది. కాని ఆ ఊళ్ళో అందరూ ఆయన్ని "అంకుల్ జో" అనే పిలిచేవారు. అదొక చిన్న టౌను. స్నేహ పూర్వక మైన వాతావరణం వెల్లివిరిసేది అక్కడ.

అంకుల్ జో ఒక్కడే ఆ ఊళ్ళో పిల్లల డాక్టరు. ఆ వూళ్ళో పిల్లలందరినీ ఆయనే ఈ లోకంలోకి తెచ్చి స్వాగతం పలికేవాడు, వాళ్ళు పెరిగి పెద్దయ్యే వరకు వారి ఆరోగ్య సంరక్షణ చేసేవాడు. ఆ వూరికి పోస్టాఫీసు ఎంత అవసరమో అంకుల్ జీ కూడా అంతే అవసరం.

1945లో ఆ వూరికి మరొక డాక్టర్ కెంట్ వచ్చాడు. అతను యువకుడు. అక్కడ ఒక ఇల్లు తీసుకొని, దానిని ఆధునికంగా మలచి ప్రాక్టీసు పెట్టాడు.

అతన్ని మొదట కలుసుకొని ఉత్సాహంతో స్వాగతం చెప్పిన వ్యక్తి అంకుల్ జో.

"ఈ వూరికి మీరు రావడం అందరి కంటే నాకు ఎక్కువ సంతోషంగా ఉంది. ఎందుకో తెలుసా? నాకిప్పుడు కాస్త విరామం లభిస్తుంది. ఈ వూరికి మీ వంటి యువకుల అవసరం చాలా చాలా ఉంది. ఆధునిక వైద్య విధానాలు, మందులూ ఇక్కడ మీరే ప్రవేశ పెట్టాలి. అందుకు నా సహకారం మీకు ఎప్పుడూ ఉంటుంది" అంటూ ఆ కొత్త డాక్టర్ని తన అభినందనలతో, అభిమానంలో ముంచెత్తాడు అంకుల్ జీ.

"థాంక్యూ డాక్టర్"! అంటూ ఆ కొత్త డాక్టరు తన ధోరణిలో కృతజ్ఞత తెలియ జేశాడు.

కొత్త డాక్టరు ధోరణి ముక్తసరిగా, ముభావంగా ఉంటుంది. అతను తన పేషంట్లతో కూడా లెక్కించినట్లుగా అవసరమైనంత వరకే మాట్లాడతాడు.

పేషంట్లతో ఆ డాక్టర్లిద్దరూ వ్యవహరించే తీరులో చాలా వ్యత్యాసం ఉంది. పేషంట్ చెప్పేదానిని ముభావంగా విని తన డయాగ్నొసిస్ శాస్త్రీయ పదాలతో (మెడికల్ టెర్మ్సులో) అర్థం కాకుండా చెప్పేవాడు డాక్టర్ కెంట్.

అంకుల్ జో అట్లాకాదు. పేషంటు చెప్పేదానిని ఆయన ఆత్మీయుడి లాగ, స్నేహితుడిలాగ వినేవాడు. తన డయాగ్నొసిస్‌ను పేషంటుకి అర్థమయ్యేలాగ మామూలు భాషలో అతి సరళంగా 'కడుపునొప్పి చెవినొప్పి' లాటి పదాలతో తేల్చేసి చెప్పేవాడు.

అందువల్ల చాలా మందికి ముఖ్యంగ యువతరానికి కొత్త డాక్టరుపై గురి కుదిరింది. కొత్త డాక్టర్ కెంట్ త్వరలోనే ప్రాక్టీసు బాగా పెరిగింది. ముఖ్యంగా కూల్‌గా, ఇంపర్సనల్‌గా ప్రొఫెషనల్‌గా ఉండే అతని ధోరణి యువతరాన్ని బాగా ఆకర్షించింది. అదీ కాక, అతను కొత్త వైద్య పరికరాలతో, కొత్త పద్ధతులతో వైద్యం చేసే డాక్టరు. అనతి కాలంలోనే ఆ చుట్టు ప్రక్కల తనంత వాడు లేడనిపించుకొన్నాడు. ఆవిధంగా కొత్త డాక్టర్ కెంట్ ఆ వూళ్ళో అత్యంత ప్రముఖ వ్యక్తి, అత్యవసరమైన వ్యక్తి అయ్యాడు.

అయితే అతను అంకుల్ జో అంత సులభంగా ప్రజలకు అందుబాటులో ఉండేవాడు కాదు. నిజమైన కారణం ఏదీ లేకుండా, కొత్త డాక్టరు దగ్గరకు వెళ్ళాలన్నా, అతనిని పిలవాలన్నా ప్రజలు భయపడేవారు. అత్యవసరమైతేనే తప్ప ముఖ్యంగ రాత్రి సమయాలలో తనను పిలవ వద్దని డాక్టర్ కెంట్ అందరికీ అర్థమయ్యేలాగ చేశాడు. కొత్త డాక్టర్ని ఆ వూరి ప్రజలు ఎంత గౌరవించినా, అతని లోని ఈ లక్షణం వారికి అసంతృప్తిగానే ఉంది.

ఒకనాడు అంకుల్ జో డాక్టర్ కెంట్‌ను కలుసుకున్నాడు. "చూడు నాయనా! ఇక్కడ జనం అందరికీ డాక్టరంటే ఎప్పుడు పిలిస్తే అప్పుడు పలికే లాగ, ధైర్యం చెప్పేలాగ ఉండా లనుకొంటారు. వాళ్ళు అట్లా అలవాటు పడ్డారు. వాళ్ళకి నువ్వు ఇంకా అందుబాటులోకి రావాలి."

డాక్టర్ కెంట్ నవ్వేశాడు. "చూడండి డాక్టర్ వాట్సన్! అర్ధరాత్రి సమయాలలో వచ్చే కాల్స్‌లో ఏవి నిజమైన అవసరాలో, ఏవి కావో నేను పసిగట్టగలను. వాటిలో చాలా వరకు జనం ఏదో ఊహించుకొనే అస్వస్థతలే. నిజమైనవి కావు. డాక్టరు ఒకడు ఉన్నాడు. కదా అని ఎప్పుడంటే అప్పుడు పరిగెత్తుకు రావడం. డాక్టరుగా నాకనిపిస్తే

# ఆశాస్పందనం

ఒకొక్కప్పుడు కళ్ళు మూసి
ఒక్కొక్కప్పుడు కళ్ళు విప్పి
నా చుట్టూ తిరిగే నిశీథి
నీకై ప్రదక్షిణ చేస్తూంది.
వేదన తీగ నిర్బంధన చేస్తుంది
నిండిన కన్నీ చెక్కిళ్ళ పైనుండి
ఒలికి జారు కన్నీటి పొరల్ని
వాకిటిలో నిశాపర్ణ రూపాన
ఎండలో సూర్యుణ్ని మింగేసి
రాత్రి కూర్చుందా? విహంగంలా
అంతటా నిండి, పట్టో డేరా
రాక పోదన్నంత ధైర్యంలో.
పదపదాన క్రమ్మిన చీకటి
అణువు అందు వెలుగిక వేదన!
కణ కణాన దాగిన వెల్గుల
ఎదల లోన శాంతి స్పందన.
రాత్రి వచ్చిన ఉన్న ఇల పంక్తివలె
నిద్ర ప్రవేశించినా ఉన్న వివేకం పలికే
కాలం గడిపేస్తున్నది హిమాలి వలె
లోలోన కదలే చేపం వలె స్ఫురించు!
చీకటి స్పర్శకు భయపడే ఎదల
వెన్నెల ధైర్య కళలు వహించని!
ఆకాశాన చంద్రుని వలె ఎదలో నిశ్శబ్దం
రాసే జీవితాన ఝరిణి వలె శబ్దం సాగి
కానీ ఈ నిశావరణం
రాగంలో పునీత మయం
కానీ ఈ హృదావరణం
నాదంతో ప్రశాంతమయం
రాత్రి కొండల మాటున లేచ్చే
ఎంత సేపని దాగి వుంచేను
మాపుతో అలలై పాటలో పూచే
రేఖలై మహవీధి వర్తించేను.
ప్రభాతమ్మై అడుగులు వేస్తూ పదా
వదలి చీకటి వెలుగా గుర్తుగా
కదలిపోవు ప్రతి క్షణం వాస్తవం
విజయలో మెలకువలో ప్రాణికీ
విర్చిన వృక్షంలో క్షేత్రంలో
పైన ప్రయాణించే మేఘంలో
క్రింద పదించే స్రోతస్సుల్లో
జీవన రూపంలో చైతన్యం.
స్మిత శోభలతో నిలచింది క్షితిజం
ఉదయ స్ఫటికం వలె ఉంది హృదయం
పైన సాగే బరువుల ధూళి పొరగా
తేల్చివేస్తుంది అవని సాధుమతితో
అరుణ చిత్ర పరంపరతో నవనాదం
కదలుతూంది దిశా వలయం పలికిస్తూ
ఎవరు ప్రేమించే నీ నీడలేవి నీడలెను
ఎవరి? నీలో నాలో ఆర్తి ఉన్న మానవుడు.

-మాదిరాజు రంగారావు

కన్న గ్రహింపు వాళ్ళకి లేదు. వాళ్ళు చెప్పి నట్లల్లా ఆడి, ఎన్ని రాత్రులని నిద్ర మానుకో గలం చెప్పండి. ఇట్లా జారి తప్పుకొంటూపోతే, వీరికి డాక్టర్ని ఒక బానిసలాగ తయారు చేసే స్తారు వీళ్ళు!" అంటూ తన అసహ్యతి తెలియ జేశాడు.

కొద్దిసేపు సందేహించి అంకుల్ జో డాక్టర్ కెంట్‌ని ఇట్లా అడిగాడు.

"నువ్వేమీ అనుకోక పోతే నాదొక చిన్న సూచన నాయనా, నీ ప్రాక్టీసు బాగా పెరిగి పోయింది. పగలంతా కష్టపడి, మళ్ళీ రాత్రి కూడా నువ్వు కష్టపడ మనటం భావ్యం కాదు. పోనీ ఒకని చేద్దాం నీ పేషంట్లలో రాత్రి పూట నువ్వు అటెండ్ కావడానికి ఇష్టపడని కాల్స్‌ని నేను అటెండ్ అవు తాను నీ తరఫున, నీకిష్టమైతే"

డాక్టర్ కెంట్ ఆశ్చర్య పోయాడు. ఈ ముసలి డాక్టరు తన పేషంట్లకు తన తరఫున అటెండ్ అవుతానంటా డేమిటి? అసలీయన ఉద్దేశ్య మేమిటి?

"మీరు పెద్దవారయ్యారు. మీపని తగ్గిం చాల్సిన బాధ్యతనాది. మీరే నాపనిని చేస్తానం టున్నారే" అంటూ తన అభ్యంతరాన్ని తెలుప బోయాడు.

"కాదు నాయనా. వైద్య శాస్త్రం ప్రాక్టీసు గురించి నాకు కొన్ని అభిప్రాయాలున్నాయి. వైద్య శాస్త్ర నైపుణ్యంలో నీకు దీటైన వాళ్ళులేరు. కానీ దానితో పాటు పేషంట్లకి ధైర్యం చెప్పటం, అనునయించడం కూడా అంతే ముఖ్యం అని నేనను కొంటాను. నీకు ఇష్టమైతేనే నేను నీ తరఫున నైట్ కాల్స్‌కి అటెండ్ అవుతాను" అని చెప్పాడు అంకుల్ జో.

చివరికి డాక్టర్ కెంట్ ఈ సూచనకు ఒప్పు కొన్నాడు. రాత్రి సమయాలలో డాక్టర్ కెంట్ పేషంట్ల కాల్స్ అన్నింటికి అంకుల్ జో అటెండ్ అయ్యేవాడు. భోరున కురిసే వర్షమైనా, వణి కించే చలి అయినా, ఎటువంటి వాతావరణమైనా సరే, రాత్రి సమయాలలో ఎవరికి వైద్య సహాయం అవసరమైనా అంకుల్ జో తన పాతకారులో తిరుగు తూనే ఉండేవాడు. దాదాపు ప్రతి రాత్రీ ఆయనకు నైట్ కాల్స్ ఉండేవి. దాని ఫలితం ఆయన శరీరం మీద స్పష్టంగా కనబడటం ప్రారంభించింది. వార్ధక్యమేగాక, పని భారం కూడా ఆయన జుట్టును బాగా తెల్లబరిచింది. భుజాలు క్రుంగాయి. కళ్ళచుట్టూ నల్లటి చారలు కనబడు తున్నాయి. అన్నింటి కన్న అందరినీ బాధించిన విషయం ఇంత శ్రమించే అంకుల్ జో కొత్త కారయినా కొనలేక పోవటం.

వాటర్ టౌన్‌లోని ప్రజలందరికీ డాక్టర్ కెంట్ వైద్య శాస్త్ర నైపుణ్యంపై తిరుగులేని గురి ఏర్పడింది. ఆయనకు ఎనలేని గౌరవం చూపే వారు. కాని వారు ప్రేమించేది మాత్రం అంకుల్ జో.

ఇట్లా ఉండగా వూళ్ళో అంటు వ్యాధి సోకింది ప్రజలను భయ భ్రాంతుల్ని చేసింది. భీభత్సాన్ని సృష్టించింది. అపాయం లేకపోయినా అంకుల్ జోకి పని మరింత ఎక్కువయ్యింది. ఆయన బాధ్యత అంతా తనదే అన్నట్లుగా పరిచర్యలు చేయడం మొదలు పెట్టాడు ఇది ఎవరినీ ఆశ్చర్య పరిచే విషయం కాదు.

కానీ అంతటి భీభత్సంలోనూ అందరికీ ఆశ్చర్యం కలిగించినది డాక్టర్ కెంట్. అతను విశ్వరూపం ధరించాడు అన్నట్లుగా వైద్యం చేస్తు న్నాడు. అలసి, సమయస్ఫూర్తి, కొత్త వైద్య విధానాలు, కొత్త మందుల వాడకం ఇవన్నీ ప్రవేశ పెట్టాడు. ఆ వారం రోజులూ డాక్టర్ కెంట్ అహో రాత్రాలూ కష్టించాడు. రాత్రులలో నిద్ర లేదు. తిండి ధ్యాసలేదు. ఎంతసేపు రోగులూ, చికిత్సా అప్పుడు కూడా ఆయన తన ముభా వపు ధోరణి విడనాడలేదు. ఎప్పటిలా గంభీరం గానే ఉండేవాడు. అతని పుణ్యమా అని మళ్ళీ వూళ్ళో ఆరోగ్యం అడుగు పెట్టింది.

"ఈ కుర్రవాడి మూలాన ఇంతమంది బతక గలిగారు. ఇతను లేకపోతే ఈ రోగులందరూ ఏమై పోయేవారో. ఎంతోమందికి ఈ కుర్రాడు ప్రాణ భిక్ష పెట్టాడు. ఇతని ఋణం మనం తీర్చు కోలేం" అంటూ అంకుల్ జో డాక్టర్ కెంట్ గురించి అందరికీ తెలియ జెప్పాడు.

వాళ్ళందరూ అంకుల్ జో అన్నది నిజమే నని, కొత్త డాక్టరు మూలానే ఎంతో మంది ప్రాణం నిలబడిందనీ ఊరిలో వాళ్ళకు చెప్పారు.

వూరంతటా మళ్ళీ ఆనందపు వెలుగులు ప్రస రించాయి. డాక్టర్ కెంట్ వూరి ప్రజా దృష్టిలో దేవోదాత్తుడైనాడు. వూరంతా అతనికి నివాళి పట్టింది. డాక్టర్ కెంట్ గొప్పతనాన్ని చాటి చెప్పిన వాడూ, అతనిని అభినందించడంలో మొదటివాడు అంకుల్ జో.

ఆ వూరిలో బిజినెస్ మెన్స్ క్లబ్ ఒకటి ఉంది. అది ప్రతియేట ఆ వూరిలో అత్యుత్తమ పౌరుని ఎన్నుకొని వెండి కప్పు బహూకరించి, సన్మాని స్తుంది. ఆయేడు సన్మానితునిగా డాక్టర్ కెంట్ పేరు ఏకగ్రీవంగా సూచింప బడింది.

సన్మానం రోజున టౌను హాలంతా క్రిక్కిరిసి ఉంది. ఆసమయంలోనూ డాక్టర్ కెంట్ ముభావంగా తన మామూలు ధోరణిలోనే ఉన్నాడు.

మేయరు డాక్టర్ కెంట్‌కు వెండికప్పు బహూ కరించాడు. హాలంతా కరతాళ ధ్వనులతో మార్మో గింది. డాక్టర్ కెంట్ ఆ వెండి కప్పును అంద కొని సభాముఖంగా నిలబడ్డారు. ఇప్పుడు అతని ముఖంలో ఏదో తేడా కనబడుతోంది.

డాక్టర్ కెంట్ సభను ఉద్దేశిస్తూ మాట్లా డటం ప్రారంభించాడు. "నాకు ఈ సన్మానం చెయ్యాలని సంకల్పించుకొన్న కార్యకర్తలకు నేను కృతజ్ఞతలు చెప్పు కొంటున్నాను. కాని ఆ కృతజ్ఞతతో పాటు నా అభ్యర్థన కూడా ఒకటి ఉంది. నేను అంటువ్యాధి సోకినప్పుడు చేసిన వైద్యానికి, చూపిన శ్రద్ధకూ మీరందరూ నాకీ గౌరవం కల్పించారు. ప్రతి డాక్టరుకీ ఒక ఆశ ఉంటుంది—మన వూరిలో జరిగిన సంఘటనల వంటివే జరిగితే

తాను రంగంలోకి దూకి, తన నైపుణ్యాన్ని అంతా ప్రదర్శించాలనే కోరిక ఉంటుంది. ఆ విధంగా చూస్తే, ఆ వారం రోజులూ నేను చేసిన కృషిలో నా స్వార్థమే ఎక్కువగా ఉంది. నేను ఆ వారం రోజులూ నా శక్తికి మించిన పని ఏదీ చెయ్యలేదు. నేను ఒక్కడినే కాదు., ఈ వూరిలో ప్రతి వ్యక్తీ ఆ వారం రోజులు చెయ్య గలిగినంతా చేశాడు. ఎవరికి చేతనైనంత వాళ్లు చేస్తే, నేనూ నాకు చేతనైనంత చేశాను. ఆ విధంగా నేను చేసిన కృషిలో గొప్పతనం లేదు. నేనూ అందరిలాంటి వాడినే. అందువల్ల నేనీ ప్రత్యేక గౌరవానికి అర్హుడను కాననే మీకు మనవి చేస్తున్నాను. ఇది నేను మాట వరుసకుగానీ, అతి వినయం ప్రదర్శించాలనిగానీ అంటున్నది కాదు. నేను చెప్పబోయే మరొక విషయానికి పరిచయం మాత్రమే.' డాక్టర్ కెంట్ చెప్పటం ఆపి సభలో మొదటి వరుసలో కూర్చున్న అంకుల్ జో కేసి చూశాడు. మళ్ళీ కొనసాగించాడు.

"స్నేహితులారా! అంటు వ్యాధులు ఎన్నో యేళ్లకు ఒకసారి సంభవించేవి. కేవలం వాటికి వైద్యం చెయ్యగలగడమే వైద్య శాస్త్రానికీ, ప్రాక్టీసుకీ నిర్వచనం కాదు.

ఈ వూరిలో నేను ప్రాక్టీసు ప్రారంభించిన మొదటి రోజులనుంచీ నాకు ఆసక్తిని కలిగించి, పేరు తెచ్చిపెట్టే భాగానికే నా పనిని పరిమితం చేసుకొన్నాను. నాకు విసుగు కలిగించి, గుర్తింపు ఏ మాత్రమూ తెచ్చిపెట్టని పని నుంచి నేను వీలయినంతవరకు తప్పించుకొన్నాను. ఈ విషయం మీ అందరికీ తెలుసు.

నాకంటే వయసులో ఎంతో పెద్దవారై, వార్ధక్య భారం అనుభవిస్తున్న డాక్టర్ వాట్సన్ నా దగ్గరకు వచ్చి, నాకు అటెండ్ కావడం ఇష్టంలేని నైట్‌కాల్స్‌కు తాను అటెండ్ అవుతానని సూచించారు. ఆయనకు డబ్బు అవసరమై అట్లా అడుగుతున్నారేమో అనుకొన్నాను మొదట. కానీ, నా అభిప్రాయం తప్పని వెంటనే తెలిసింది. ఆయన నాదగ్గరకానీ, నా పేషంట్ల దగ్గర కానీ చిల్లిగవ్వ అయినా తీసుకోవడానికి నిరాకరించారు. అదే నన్ను ఆలోచింప జేసింది. ఆయన అట్లా చెయ్యడానికి కారణ మేమిటని నన్ను నేనే ప్రశ్నించుకొన్నాను.

ఆయన ఈ వయసులో ఎందుకు ఇంత శ్రమ పడుతున్నారు? దానికి ప్రతిఫలం ఆయన ఆశించడంలేదు. కనీసం ఆయన చేసే శ్రమకు గుర్తింపు కూడా లేదు. ఆ సంగతి ఆయనకూ తెలుసు. ఆ పాత కారులో వణికించే చలిలో లేదా జోరుగా పడుతున్న వర్షంలో అందరూ హాయిగా నిద్రించే సమయంలో ఆయన ఎందుకు అంతంత దూరం ప్రయాణం చేస్తారు? నాకేకాదు, ఆయనకీ బాగా తెలుసు—తనను పిలిచిన పేషెంటుకు ఉన్నది సాధారణమైన అస్వస్థతే కాని ఎమర్జెన్సీకాదని, మర్నాటి వరకూ పేషంటు వైద్యం కోసం ఆగవచ్చని. అయినా ఆయనెందుకు అంత శ్రమ తీసుకొంటారు? ఈ ప్రశ్నే నన్ను వెంటాడటం మొదలు పెట్టింది. చివరికి ఈ మధ్యనే నాకు దానికి సమాధానం లభించింది.

వైద్య శాస్త్రానికి డాక్టర్ వాట్సన్ చెప్పే నిర్వచనమే ఆ సమాధానం. వైద్యశాస్త్రం అంటే ఆయనకున్న భావనే అందరి డాక్టర్లకూ ఉంటే, ఈ ప్రపంచమే మరింత సుందరంగా, మరింత ఆకర్షణీయంగా మారిపోతుంది.

నా పేషంట్లలో ఒకరు వైద్య సహాయార్థం నావద్దకు వస్తే, అది ఎమర్జన్సీ కాల్ కాదని నేను వెంటనే పోల్చుకోగలను కాని ఒక విషయం నేను గ్రహించలేక పోయాను. ఆ పేషంటు చాలా భయపడిందనీ, ఆమె తద్వారా కుటుంబం అంతా, భయపడుతుందనీ, ఆ అస్వస్థత అతి స్వల్పమైనదైనా వారికి అర్థం కానిది కావడంవల్ల చాలా భయానికి లోనవుతున్నారనీ, వారికి ఆ సమయంలో కావలసింది వైద్య సహాయంకన్నా, దాని గురించి తెలిసిన డాక్టరు అభయమూ, ధైర్యమూ చెప్పగలగడమనే విషయం నేను గ్రహించడానికి నిరాకరించాను. అందుకే ఈ వూరి ప్రజలకు నేను ఆ రకమైన సహాయం చెయ్యలేక పోయాను.

నేనే విషయంలో విఫలుడయ్యానో డాక్టర్ వాట్సన్‌ని చూసిన తరువాతగాని తెలుసుకో లేక పోయాను. ఆయన మీకందరికీ అవ్యసర సహాయాన్ని ఎప్పటి కప్పుడు ధైర్యం ఇచ్చి అండగా నిలబడుతున్నారు ఆ విధంగా ఆయన ఒక మహా స్రష్టం. ఈ వూరి ప్రజలందరూ ఆయనకు ఋణపడి ఉన్నారు. ఈ విషయాన్ని ఒప్పుకోవడానికి ఆయన నిరాకరిస్తారని నాకు తెలుసు అదే ఆయనలో గొప్పతనం.

వైద్యశాస్త్ర గ్రంథాల ద్వారా కన్న డాక్టర్ వాట్సన్ ద్వారానే నేను మెడికల్ ప్రాక్టీసులో అత్యున్నత విధాన మేమిటో నేర్చుకో గలిగాను. నేను ఈ వూరి ప్రజలకు చేసినది కొద్ది సహాయమే కాని డాక్టర్ వాట్సన్ ప్రతిఫలా పేక్ష లేకుండా, కనీసం గుర్తింపునయినా ఆశించకుండా, తన జీవితాన్నే ఈ వూరికి అంకితం చేశారు."

డాక్టర్ కెంట్ మాట్లాడటం కొద్ది సేపు ఆపాడు అతని కంటిని కమ్మిన నీటి పొరను తుడుచుకొని మళ్ళీ కొనసాగించాడు.

"నా దొక మనవి. మీరు నాకు బహూకరించిన ఈ వెండి కప్పును అందుకోవడానికి ఈనాడే కాదు, ఏనాడూ డాక్టర్ వాట్సన్ అర్హుడు. అందువల్ల స్నేహితులారా! ఏనాటికైనా ఆయనంత గొప్ప డాక్టర్‌ను కాలేకపోయినా, కనీసం ఆయన చూపిన దారిలో నడిచి ఆయన చేసిన సేవలో శతాంశం అయినా చెయ్యగలగాలనే కోరికతో, మీ అనుమతితో ఈ వెండి కప్పును సగౌరవంగా, సవినయంగా డాక్టర్ హెచ్. వాట్సన్‌కు సమర్పిస్తున్నాను"

సభలో ఒక్క క్షణం పూర్తి నిశ్శబ్దం, ఆ తరువాత సంభ్రమాశ్చర్యాల నుంచి తేరుకొన్న ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో ఆ హాలు మార్మోగి పోయింది. అందరి ముఖాలలో ఆనందం.

డాక్టర్ కెంట్ వేదిక దిగి, వెండికప్పు పట్టుకొని మొదటి వరుసలోకి వచ్చాడు అతని కన్నవెంట కారుతున్న బాష్పాలను దాచే ప్రయత్నమే చెయ్యలేదు. అతను కప్పును అందిస్తూ అన్నాడు.

"ఈ వెండికప్పు న్యాయంగా మీకు చెందాలి అందుకోండి 'అంకుల్ జో'."

*

